# జీవితశాంతి

శ్రీ కె. లింగరాజు (జాతీయ రచనామండలి)

అర్థరాత్రి దరిదాపుగానే నిట్టూర్పు నిగుడుస్తు, లక్ష్మి లేచింది. అంతవరకూ గడియారం ఘంటలు లెక్కపెట్టింది సూర్యాస్తమానమైనప్పటినుండి. స్విచ్చి వేసింది. ఆలైటు వెల్తురులో ప్రక్కగా పడుకున్న భర్తని, కోపంతో చిరాకుతో, నిరాశతో, జుగుప్సతోనే చూచింది.

రాజా ప్రపంచాన్ని తెలియకుండానే, ప్రక్కమీద పడుకుని గుర్రుపెడుతున్నాడు. గుర్రు, ఓవిధమైన సంగీతంతోటే తన పని నిర్వర్తిస్తోంది. ఋంజ వాయిద్యానికి దానికి తేడాకనట్టే తడుతోంది. లక్ష్మికి మాత్రం రాజా గుర్రు నిజంగా ప్రక్కగాఉండి ఏ ఎలుగుగొడ్డో గుర్రుపడుతున్నట్టే తట్టింది.

రాజాని చూస్తే, నిద్రలో గుర్రుపట్టినప్పుడు మాత్రం జంతువు వంశంలోని వాడని జ్ఞాపకం చేస్తాడు. మెలకువవున్న జీవితంలో అతనంత సహృదయుడు, సిగ్గుపడేవాడు లేనేలేడు. అతని నవ్వు జీవితంలో చాలామంది స్నేహితుల్ని స్నేహితురాళ్లని కట్టేసింది. ఆతనితో కబుర్లు చెప్పడమే ఓ గొప్పఅని మూగేవారు.

లక్ష్మి తనభర్తలో ఈ దినదిన ప్రవర్ధమాన మవుతూన్న గుర్రు చూచినప్పటినుండీ, వేరుగా పడుకోవాలనుకునేది. కాని సంపాదించేది చిన్నజీతం, యుద్ధంరోజులు, చిన్నయింటిలో ఓ పడకగది, వంటిల్లు తప్ప ఇంకోటి సదుపాయంగా కుదర్చలేకపోయింది. కొన్నాళ్లు ఆవంటింటోనే పడుకునేందుకు ప్రయత్నంచేసింది. కాని, అది కాళ్ళు ముడుచుకుని పడుకునేందుకు చాలిన చోటు మాత్రమే అవడంవల్ల విఫలురాలైపోయింది. ఒక్కొక్కసారి రాజానే వంటింట్లో పడుకోమందా మనుకునేదికాని, రోజూ రాత్రి పడుకోబోయేటప్పుడు, ఆతడునవ్వే ఆచంటిపిల్లాడినవ్వు తన్ని చెప్పనివ్వకుండానే చేస్తోంది.

అంతగుర్రు, చెవులో జోరీగలాగ వుంటే కొన్నాళ్లు లక్ష్మి, తన స్నేహితురాల్నిఅడిగి నిద్రపట్టడానికి 'సొనరిల్' 'బార్బిటోన్' మాత్రలు వేసుకుంది. ఆరాత్రిళ్లు నిద్రపట్టినా మర్నాడు అతి నీరసంగా, మాత్రలు పనిచేసేసేవి. దానివల్ల జీవితం మరింత భారంగా కన్పించింది. కొన్నాళ్లు చెవుల్లో దూది పెట్టుకుంది. కాని ఆశబ్దం వాటికి లెక్కచెయ్యనట్టుగానే నిద్రని తోలేసింది. ఇంతకీ, నిద్రాభంగం అయిన లక్ష్మి అయివూరుకుంది.

కొన్నిరోజులనుంచీ కంటిమీద కునుకు లేకుండా, జీవశ్చవం అయిపోయింది. పైకి ఆకారంకూడా తదనుగుణంగానే మారిపోయింది. ఆవిడ నరాలన్నీ ఉద్రేకంతో హెచ్చయిపోయి అశాంతి యెక్కువ జేశాయి. ఆ అశాంతిలో యెందుకు పెళ్ళాడానా, విడిచిపెట్టేసి తనపుట్టింటికి వెళ్ళిపోదామా అనేవరకూ ఆలోచనలు వచ్చాయి.

జీవితంలో యీనిరంతరం గుర్రుపట్టే వ్యక్తివల్ల తనకు కల్గే సన్నివేశాలు, ఒక్కరూ ఆలోచించి తనమీద జాలి పడరని, అనునయనం చెయ్యరని, క్షమించరని లక్ష్మికి తెలుసు. ఆయన్నే వదిలేస్తే, పుట్టింటికే వెళ్ళిపోతే, తన్ని అందరూ 'రాక్షసి ముం..' అని వేలెట్టి చూపిస్తారు అని కూడా తెలుసు. పైగా తన భర్తనేచూచి జాలిపడతారని నిర్ణయంకూడాను...

రాజాతో ఓరోజు చెప్పిందికూడా. అతను నవ్వుతూనే విచారిస్తాడు. ఆతను తను అసలు గుర్రు పట్టనే పట్టనని వాగిస్తాడు. అయినా అదంతా నువ్వు వూరకనే వూళ్ళూవూళ్లూ కల్పించుకుంటావు అనేశాడు.

ఆ ప్రక్కగా పడుకున్న రాజాని చూస్తే, జీవితంఅంతా ఉగ్గుపాలతో తెమడ్డం ప్రారంభించింది. అంత అసహ్యం, జుగుప్స కల్గింది. ఇన్నాళ్ళనుంచి దాచుకుని లోపలున్న అశాంతి, బాధ, కోపం ఒక్కసారి తిరగబడ్డాయి. ఎక్కడికైనా ఆక్షణం, వెంటనే వెళ్లిపోవాలి, కొన్ని క్షణాలపాటు విశ్రాంతి, ప్రకృతి విరామంకావాలి అని నరాలన్నీ తిరగబడ్డాయి. ఆక్రోశించాయి. ఆక్షణం ఎక్కడికైనా...

దూరంగా, దూరంగా వెళ్ళిపోవాలి...ప్రతీకణం తోసేసింది.

ఆలోచించింది. తను, అర్ధరాత్రివేళ ఎక్కడికివెళుతుంది? స్నేహితురాలింటికి వెళదామనుకుంది. కాని ఆయింట్లోనూ రెండంటే రెండేగదులు. అన్నీ ఆలోచనచేసింది. రైల్వేగైడు చూచింది. 1½ కి బండివుంది; తనపుట్టింటి దగ్గరికి 3½ కి చేరుతుంది. ఈ రాత్రివేళ ఒంటరిగా మైలుకు పైగావున్న స్టేషనువరకూ ఎల్లా వెళ్లుతుంది. పైగా 3½ కి దిగి, స్టేషనులో, చలిలో ఎల్లాగా...

పాలుపోక లక్ష్మి బాధపడింది. ఈ పరిస్థితిలో, తనభర్త ప్రక్కగా తెల్లవారే వరకూ ఉంటే పిచ్చిఎత్తుతుంది అన్న భావం ప్రక్కనున్న హోటల్ జ్ఞాపకం తెచ్చింది. ఆహోటల్లో కొన్నాళ్లు యిద్దరూ కలసి, పట్నంలో ఇల్లుదొరక్క ఉన్నారు. భోజనం, బస అన్ని ఉండడం జ్ఞాపకం వచ్చాయి. నిర్ణయంచేసుకో అని ప్రవృత్తులు ముందుకు తోసేయి.

‘ఏమండోయ్!’ లేపింది. కాని రాజా మెలుకువలోకి రాలేకపోయాడు. తిరుగ జబ్బ పట్టుకు ఊపింది...

‘ఏమండోయ్! మిమ్మల్నే...’

ఖంగారుగానే రాజాలేచి... ‘ఏం? దొంగలా? చప్పుడైందా?...’ అన్నాడు. కాదు అంటూనే అంతాచెప్పింది.

అతడు ఆశ్చర్యపడ్డాడు. ‘ఈ అర్ధరాత్రివేళా?...ఒంటరిగా?...’ ఇంక ఏమనాలో అతనికి తెలిసిందికాదు. ఇదివరకు లక్ష్మికి, తనకు మాటపట్టింపులువస్తే తనువెళ్లి హోటలులో పడుకున్న రోజులు జ్ఞాపకం వచ్చాయి. ఈనాడు, ఆకోపంతో తనకి జవాబు ఇవ్వడానికి పన్నిందా అనుకున్నాడు లోపల.

‘అర్ధరాత్రే...ఒక్కర్తినే, దుస్థితిలో యిక్కడనే వుంటే రేపు పొద్దున్నకి విశాఖపట్నం పంపాలి...’

అంటూనే తనచీర కట్టుకుంది. అద్దంలో ఓసారి చూచుకుంది. నిద్రలేక ఎర్రబడ్డకళ్ళు తన్ను ‘దేహీ’ అని అడుగుతున్నట్లు కన్పించాయి.

‘ఖర్చులకి డబ్బుకావాలి’ అంటూనే స్టేండుకు ఉన్న అతని కోటులోంచి పర్సుతీసి, ఇరవై రూపాయలు తీసుకుంది...

ఇదంతా చూస్తున్న రాజాకి ఏమనాలో తెలిసిందికాదు. పెళ్లి చేసుకున్నప్పటినుండి లక్ష్మిని అర్థంచేసుకుందామనే ప్రయత్నించేడు. ఒక్కొక్క సమయంలో అర్థంకాని వ్యక్తిలాగే ఉండిపోయింది. ఈ వ్యగ్ర భావాల్ని యెలా సంబోధన చేసికోవాలా అని తచ్చాట పడ్డాడు.

‘ఒక్కర్తెవు వెళితే హోటల్ వారు ఏమనుకుంటారో ఆలోచించావా?’ నెమ్మదిగానే అన్నాడు.

‘ఏమనుకుంటారు, భర్తని రైలు ఎక్కించి వచ్చింది. లేకపోతే ఏ పంతులమ్మో అనుకుంటారు...’ గట్టిగానే అంది.

‘అయితే రేపు ఉదయం తిరిగి వస్తావా?’ గుమ్మము దాటుతూంటే అన్నాడు...

‘ఒస్తాననే అనుకుంటా’ అంటూనే మెట్లు దిగింది. తలుపువేసుకొని రాజా నెమ్మదిగా ప్రక్కదగ్గరికి వెళ్ళాడు. ఈ ఆశ్చర్యం అతన్ని విచిత్రంగా మార్చింది. హృదయం ఎందుకో విరక్తి, ఆర్ద్రత రెండూకూడా సంయోగంగానే అనుభవించింది. ఆలోచించాడు...అతనికి తెలియకుండానే కళ్ళమీదికి కునుకు వచ్చింది. తలగడామీద తలవాలింది...

హోటల్లో గదితలుపు గడియ పెట్టుకునేటప్పటికి ఒంటిగంట కొట్టింది. అదూది పరుపుమీద కూర్చున్నప్పుడే, ఎక్కడలేనటువంటి ప్రశాంతత లక్ష్మికి గోచరించింది. మంచానికి ప్రక్కగా, కిటికీలోంచి అప్పుడే ఉదయించిన చంద్రుడు, మెరిసే నక్షత్రాలూ, అక్కడక్కడ మేఘాలు, చల్లటిగాలి, అన్నీ హృదయాన్ని స్వర్గసోపానాలమీద కూర్చోబెట్టాయి.

జీవితంలో యెంత మధురంగానో ఆప్రకృతి కన్పించింది. అల్లాంటి వాతావరణంలో ఉంటే ఆకలీ, దప్పిక, సంసారం ఎందుకు అనిపించింది. రాజా జ్ఞాపకం వస్తున్నట్టు తడితే, గొంతుకలోనే ఆతలంపుని శిరచ్ఛేదనం చేసేసింది.

ఏవో భావాలు ఊహించుకుంది. సన్నగా తను చిన్నప్పుడు పాడినపాట జ్ఞాపకం వచ్చింది. నెమ్మదిగానే అని

శ్శబ్దంలో పాడింది. పాడుతున్నప్పుడు మధుర సన్నివేశాల ప్రశాంతత తనుపాడుచేస్తానేమో అనుకుంది, సిగ్గుపడింది....

అంతా నిశ్శబ్దం. దేవతలు పాడి ప్రపంచాన్ని నిద్రపుచ్చారా అన్నట్టుగా ఉంది.

ఆ వూహాల్లో ఎప్పుడు కళ్లు మూసుకున్నాయో తెలియనే లేదు. మధురంగా యెన్నో కలలు కంది. దేవదానవులు యుద్ధం చేస్తుంటే, తను మోహినీ అవతారం యెత్తి అమృతం పంచి పెడుతున్నట్టు కలగంది. ఆనిద్రలోనే నవ్వుకుంది.

కొన్నాళ్ళనుంచి అలసిపోయిన శరీరకణాలన్నీ మేల్కొనేటప్పటికీ ఎనిమిది అయింది. లేచి కళ్లు నులుముకుని గడియారం చూచుకుంది. ' ఎనిమిది '-ఆశ్చర్యం వేసింది. ఎంత ఆనందంగా నిద్రపోయాను అనుకుని కులికింది.

ప్రాతః కాలపు చర్యలన్నీ అయ్యేటప్పటికి సర్వర్ కాఫీ ఫలహారాలు తెచ్చేడు. అవి తింటున్నప్పుడు ఇంత ఆలస్యంగా లేచినందుకువాడు విసుక్కుంటున్నాడా అని అనుకున్నా తను డబ్బిస్తున్నాను అని సముదాయించుకుంది.

బట్టలు వేసుకునే టప్పుడు ఇవ్వాళకూడా, ఇంకా నాలుగైదు రోజులు అక్కడే వుందామనిపించింది. ఆ ప్రశాంతతలో నూత్న ఉత్సాహం 'ఉండిపో' కనీసం ఓ నాల్గు రోజులైనా అంది. దాంతోటే సాయింత్రం స్నేహితురాల్ని పిలుస్తా, ఇద్దరం సినీమాకి వెళ్ళి మళ్లీ భోజనం, నిద్ర...అనుకుని కార్యక్రమం వేసుకుంది.

నిద్ర. ఈ ప్రకృతి పరిసరాల్లో పూర్ణ నిద్ర. శాంతంగా నిద్ర. ఆనందంగా నిద్ర...నిద్ర అనేటప్పటికే, తల్చుకునేటప్పటికే లక్ష్మికి ఆనందం ఊచేసింది. సిగ్గుపడిపోయింది.

కాని రాత్రి మేనేజరుతో ఒక్కరోజే ఉంటానని చెప్పింది. ఈ ఆఖరు నిర్ణయం, ' ఇంకా ఉంటాను 'అన్నది చెప్పడానికి, మెట్లుదిగింది. దిగేటప్పుడు రాణీలాగే దిగింది...

మేనేజరు వినయంగానే నమస్కారం చేసేడు. 'ఇంకా నాల్గైదురోజులు ఆ గది నేను తీసుకుంటా...' అంది. అతడు వినయంగానే నవ్వేడు.

'కాని...' అని ఆగిపోయేడు.

'ఏం...ముందరగా ఎవరికైనా మాట ఇచ్చేరా ?'

'లేదు...కాని ఆ గదికాక ఇంకొకటి......' మేనేజరు ఎల్లా చెప్పాలా అన్న సందిగ్ధంలో పడ్డాడు.

'ఎంచేత ?'

'ఆ గదికి ప్రక్కగా ఉన్న లేడీ డాక్టరుగారు, చాలా రోజులునుంచి అక్కడే వుంటోంది. ఆవిడ చాలా సున్నితమైనది. బలహీనతవల్ల విశ్రాంతి పొందుతోంది. ఆవిడ ప్రొద్దుటేవచ్చి "రాత్రంతా నిద్రపోలేకపోయేను. ప్రక్కగదిలో ఎవరో గుర్రు పట్టడం ప్రారంభించేరు. నాల్గుఅయిదుసార్లుమధ్యగావున్న కార్డుబోర్డు హద్దుమీద తట్టేను. లేవలేదు. ఆ గుర్రు నిజంగా...ఎలుగ్గొడ్డు"...క్షమిస్తారనుకుంటా. కావలిస్తే చివరగాఉన్నది అద్దెకు ఇస్తాను...' అన్నాడు.

లక్ష్మికి ఒక్కసారి మొఖం తెల్లబడిపోయింది. ఆశ్చర్యం, సిగ్గు, హృదయాన్ని పీడించేయి. హృదయం పిసుక్కుపోయింది.

'ఆ! మర్చిపోయా నా స్నేహితురాలింటికి వెళ్లాలి... మీ బిల్లు ఇస్తారా ?...,

అంతే!

ఎంత త్వరగా రాజాని కల్సుకుంటానా అన్న ఆత్రుతతోటే రోడ్డు ఎక్కింది.

—భావం : ఆర్. సి. మండే